



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

మంగళవారం 8 జులై 2025 పేజీలు 8


# త్వరలోనే అర్హులందరికీ ఇళ్ల స్థలాలు



- ఎన్నికల హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం
- రూ.23.92 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- ఇంటింటికీ తెలుగుదేశంలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి

**గన్నవరం మేజర్ న్యూస్ :** అర్హులైన లబ్ధిదారులందరికీ త్వరలోనే ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన కూటమి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లూ చేస్తోందని అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు- ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం గన్నవరం నియోజకవర్గం ఎనికేపాడు గ్రామంలో స్థానిక గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి మంత్రి గొట్టిపాటి పాల్గొన్నారు. ముందుగా స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో 33 మంది లబ్ధిదారులకు రూ.23.92 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీలను పంపిణీ చేశారు. అనంతరం రూ.45 లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమం అనంతరం ప్రజల వద్దకు వెళ్లిన మంత్రి... ఏడాది కూటమి పాలనలో హామీలు అమలవుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కూటమి అమలు చేస్తున్న పథకాలన్నీ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. తల్లికి వందనంతో పాటు పింఛన్లు ఎలా అందుతున్నాయని లబ్ధిదారులతో మంత్రి గొట్టిపాటి మాట్లాడారు. అదే విధంగా ఏడాదిలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి

మిగతా 2లో

## సమయపాలన పాటించకుంటే సస్పెన్షన్

- గ్రీవెన్స్ హాల్ డోర్లు ఉదయం 9.30కల్లా బంద్ చేయండి
- ఆలస్యంగా వచ్చే జిల్లా అధికారులపై వేటు తప్పదు
- సమయపాలనే అధికారుల పనితీరుకు గీటురాయి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, జులై 7, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సమావేశానికి జిల్లా అధికారులు సమయ పాలన పాటించకుంటే సస్పెన్షన్ చేసేందుకు వెనుకాడబోమని, ఉదయం 9.30 గంటలకల్లా గ్రీవెన్స్ హాల్‌కు జిల్ల అధికారులు చేరుకోవాలని, ఆలస్యమైతే వేటు తప్పదని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హెచ్చరించారు. జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక మిగతా 2లో...



సమస్యల పరిష్కారం సమాజాభివృద్ధి లక్ష్యంగా

## సుపరిపాలనలో తొలి అడుగు



- పేదరికం లేని సమాజ నిర్మాణం కూటమి ప్రభుత్వ లక్ష్యం
- సమస్యల్ని సత్వరమే పరిష్కరించేందుకు సన్నాహాలు
- ప్రజలు కూడా అభివృద్ధి, సమస్యల పరిష్కారంలో భాగస్వాములవ్వాలి
- అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచించేలా కమిటీలు ఏర్పాటు చేసుకున్నాం
- 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర

వివరాలు 2లో...

## పేదరిక నిర్మూలనలో భాగస్వామ్యం అవ్వండి

జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ 2





## పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి

ఈనెల 10వ తేదీన జిల్లాలో రాష్ట్ర గవర్నర్ పర్యటన

అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డికే బాలాజీ

వివరాలు 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## త్వరలోనే అర్హులందరికీ ఇళ్ల స్థలాలు



పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ... గన్నవరం నియోజకవర్గ ప్రాంతంలో ఎక్కువ మంది ఇళ్ల స్థలాలు కావాలని విజ్ఞప్తి చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తుందని స్పష్టం చేసిన మంత్రి... ఇళ్ల స్థలాల విషయాన్ని అధికారులకు చెప్పామని.., ఎంత మందికి అవసరమో నివేదిక రూపొందించమని ఆదేశాలు కూడా జారీ చేశామన్నారు. అర్హులందరికీ అతి త్వరలోనే ఇళ్ల స్థలాలను మంజూరు చేస్తామని మంత్రి వెల్లడించారు. ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తామన్నారు. రాష్ట్రం లోటు బడ్జెట్ లో ఉన్నా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి రాష్ట్ర ప్రజలందరూ అండగా ఉండాలని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి పిలుపునిచ్చారు. అదే విధంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్ట పడుతున్న యార్లగడ్డ వెంకట్రావు లాంటి ఎమ్మెల్యే దొరకడం గన్నవరం నియోజకవర్గ ప్రజల అదృష్టమని ప్రశంసించారు. రైతుల సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు సొంత నిధులతో మోటార్లు అందించిన యార్లగడ్డను ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి అభినందించారు. సీఎం చంద్రబాబు నాయుడుతో చర్చించి... గన్నవరం నియోజకవర్గ పరిధిలోని విజయవాడ రూరల్ మండల గ్రామాలను విజయవాడ మున్సిపాలిటీలో కలిపేందుకు కృషి చేస్తానని మంత్రి గొట్టిపాటి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలతో పాటు అధికారులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి

**గన్నవరం (ఉంగుటూరు), జూలై 7,మేజర్ న్యూస్ :** ఈనెల 10వ తేదీన జిల్లాలో గౌరవ రాష్ట్ర గవర్నర్ పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డికె బాలాజీ అధికారులను ఆదేశించారు. వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం 6 వ స్నాతకోత్సవం ఈనెల 10వ తేదీన ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామంలోని స్వర్ణ భారత్ ట్రస్టులో జరగనున్న నేపథ్యంలో సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి ఆ ట్రస్టు ను సందర్శించి భద్రత ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గౌరవ రాష్ట్ర గవర్నర్ స్వర్ణ భారత్ ట్రస్టులో ప్రవేశించగానే ఎదురుగా ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి గౌరవ రాష్ట్ర గవర్నర్ పూలమాల వేస్తారని, ఆ విగ్రహం చుట్టూ పరిశుభ్రంగా ఉంచాలని, పూలతో సుందరంగా అలంకరించాలని సూచించారు ప్రవేశ మార్గంలో పందిళ్లు, మొక్కల కుండీలు, కార్పెట్ తదితర ఏర్పాట్లు సజావుగా చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఒక్క అంశానికి సంబంధించి ఒక వ్యక్తిని ఒక అధికారికి బాధ్యత అప్పగించాలని జిల్లా కలెక్టర్ విశ్వవిద్యాలయం డీన్ కు సూచించారు. విజయవాడ నుంచి స్వర్ణ భారత్ ట్రస్ట్ కు వచ్చే మార్గంలో రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. గవర్నర్ కోసం గ్రీన్ రూమ్ లో సోఫా, మంచి విద్యుత్ దీపాలతో మంచినీరు, తేనీరు తదితర వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. 6 ప్రజా మందిరంలో జరిగే కార్యక్రమానికి ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించాలని, వేదికను సుందరంగా అలంకరించాలని, వేదిక పైన ఇరువైపులా పోడియంలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా మందిరంలో సీటింగ్ ఏర్పాట్లు, అలంకరణ ఈనెల 9వ తేదీ ఉదయానికి పూర్తి చేయాలన్నారు. పబ్లిక్ అడ్రస్ సిస్టం ప్రత్యక్ష ప్రసారం తదితర ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. కార్యక్రమం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతున్న దృష్ట్యా అంతకు ముందుగానే విద్యార్థులందరూ వారికి కేటాయించిన సీట్లలో ముందుగానే కూర్చునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వేదికకు ఎదురుగా ఉన్న ప్రదేశంలో గవర్నర్‌తో పాటు బంగారు పతక విజేతలు, డిగ్రీ పొందే విద్యార్థుల గ్రూప్ ఫోటోకు అన్ని ఏర్పాట్లు సజావుగా చేయాలన్నారు. ట్రస్టు లోపల, బయట చుట్టుపక్కల చెత్తాచెదారాలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఈనెల 10 వ తేదీ న గౌరవ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ స్వర్ణ భారత్ ట్రస్టులో జరుగుతున్న వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం 6 వ స్నాతకోత్సవంలో పాల్గొంటున్నారన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. గవర్నర్ ప్రోటోకాల్ ప్రకారం కార్యక్రమం సజావుగా నిర్వహించుటకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ వెంట విశ్వవిద్యాలయం డీన్ ప్రసన్నకుమార్,. అసోసియేటెడ్ డీన్ దొరాజీరావు, గుడివాడ ఆర్డీవో జి బాలసుబ్రమణ్యం, మెప్మా పీడీ సాయిబాబు, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, డిపిఓ జే అరుణ, ఉద్యాన అధికారి జే.జ్యోతి, డీఎంహెచ్వో డాక్టర్ శర్మిష్ఠ,సి పి డి సి ఎల్ ఎస్ ఇ సత్యానందం, జిల్లా ఆహార భద్రత అధికారి గోపాలకృష్ణ, ప్రొఫెసర్ ఉమా కృష్ణ, డీఎస్పీ శ్రీనివాసరావు, ట్రస్ట్ ఇన్చార్జి పరదేశి, అగ్నిమాపక అధికారి అహ్మద్, ఎం వి ఐ సుబ్బారావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# సమయపాలన పాటించకుంటే సస్పెన్షన్

(మొదటిపేజీ తరువాయి)



గ్రీవెన్స్ హాల్ అయిన పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా అధికారులకు కలెక్టర్ నుంచి ఊహించని సంఘటన ఎదురైంది. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లాస్థాయి గ్రీవెన్స్‌కు ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని జిల్లా రెవెన్యూ అధికారి నుంచి అధికారులకు సమాచారం అందుతుంది. ఈ సమాచారం మేరకు ఉదయం 9.30 గంటలకు జిల్లా కలెక్టర్ లక్ష్మీశ గ్రీవెన్స్ హాల్‌కు చేరుకున్నారు. కొందరు అధికారులు సమావేశానికి ఆలస్యంగా రావడాన్ని గమనించిన జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఒకింత అసహనానికి గురై ఆలస్యంగా చేరుకున్న అధికారులకు తుది హెచ్చరికలు జారీచేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తోందన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు సంబంధించి సమీక్షను నిర్వహించి మరింత పారదర్శకతతో పాటు అర్జీల పరిష్కారంలో ఎదురయ్యే సమస్యలపై సమీక్షించి పరిష్కారం చూపేందుకు 9.30 గంటలకల్లా గ్రీవెన్స్‌కు హాజరుకావాలని పంపిన సమాచారాన్ని కొందరు జిల్లా అధికారులు బేఖాతరు చేయడం విధులపట్ల అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు భావించాల్సి వస్తోందన్నారు. ఇకపై ఇలాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోనన్నారు. 9.30 గంటలకు గ్రీవెన్స్ హాల్ డోర్లు మూసివేయాలని సంబంధిత సిబ్బందికి కలెక్టర్ హుకుం జారీచేశారు. 10 గంటలకల్లా హాజరుపట్టికను తమ ముందు ఉంచాలని.. ముందస్తు అనుమతి లేకుండా ఆలస్యంగా వచ్చినా, గైర్హాజరైనా అధికారులను సస్పెండ్ చేయడం జరుగుతుందన్నారు. సమయపాలన అధికారుల పనితీరుకు కొలమానమని అన్నారు. టీమ్ ఎన్‌టీఆర్ స్ఫూర్తితో జిల్లా అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారంలోనూ జిల్లాను అగ్రగామిగా నిలపడం ప్రతిఒక్కరి కర్తవ్యంగా భావించాలని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

**138 అర్జీల స్వీకరణ**

రెవెన్యూ శాఖకు సంబంధించి 53, పోలీస్ 23, ఎంఏయుడి 17, పౌరసరఫరాలు 6, హెల్త్ 6, పంచాయతీరాజ్ 6, కలెక్టరేట్ విద్య 3, డిఆర్‌డిఏ 3, వ్యవసాయం 2, డ్వామా 2, విద్య 2, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు 2, సర్వే 2, ఏపిసిపిడిసిఎల్, ఏపిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్, విభిన్నప్రతిభావంతులు, అగ్నిమాపకాలు, కెడిసిసి బ్యాంకు, ఎల్‌డిఎం, గనులు, భూగర్భ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపులు, ఆర్ఐవో, ఆర్‌డబ్ల్యుఎస్, రవాణా కు సంబంధించి ఒక్కొక్క అర్జీతో కలిపి మొత్తం 138 అర్జీలు స్వీకరించిన్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు.

# సమస్యల పరిష్కారం సమాజాభివృద్ధి లక్ష్యంగా సుపరిపాలనలో తొలి అడుగు

మచిలీపట్నం మేజర్ న్యూస్ : అభివృద్ధిలో ప్రజల్ని కూడా భాగస్వాముల్ని చేసినపుడే సానుకూల ఫలితాలొస్తాయని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలోని 45, 46 డివిజన్ల పరిధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ధాత్రి సెలబ్రేషన్స్ భాగస్వామ్యంతో డివిజన్లోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి ప్రజల వద్దకు వెళ్లారు. ప్రజల సమస్యల్ని సత్వరమే పరిష్కరించడం లక్ష్యంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి రూపకల్పన చేశామని తెలిపారు. ప్రజల నుండి వినతులు స్వీకరించి, వాటిని పరిష్కరించాల్సిందిగా అధికారులకు సూచించారు. రాష్ట్రాన్ని పేదరికం నుండి విముక్తి కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పి4 కార్యక్రమానికి రూపకల్పన చేసిందని తెలిపారు. అదే సమయంలో గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. ఇప్పటికే ప్రకటించిన విజన్ 2047, పి4 కార్యక్రమాల ప్రకారం వచ్చే నాలుగేళ్లలో రాష్ట్ర జీడీపీని 15శాతం వృద్ధి సాధించేలా ప్రణాళికలు రచిస్తున్నాం. వ్యవసాయం, పరిశ్రమలు, సర్వీస్ సెక్టార్, పర్యాటక రంగాల ఆదాయం పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం. అందుకోసం జిల్లా, నియోజకవర్గం, మండలం, డివిజన్ వారీగా ప్లానింగ్ కమిటీ ఏర్పాటు చేసుకున్నాం. మచిలీపట్నం నియోజకవర్గంలో ఉన్న గోల్డ్ కవరింగ్, చేనేత, ఆటోనగర్లో ఉన్న అభివృద్ధికి, పర్యాటక రంగంపై ప్రత్యే శ్రద్ధ చూపిస్తున్నాం. అన్ని ప్రాంతాల్లో పర్యటించి, ఆయా ప్రాంతాల్లో అభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నాం. అదే సమయంలో అభివృద్ధిలో అత్యంత కీలకమైన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యమిస్తున్నాం. ముఖ్యంగా రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సమస్యల్ని పరిష్కరించాలని నిర్ణయించుకున్నాం. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలంటే సాగునీటి సమస్యలు లేకుండా చూసుకునేలా వ్యవసాయ చెరువుల్ని యుద్ధ ప్రాతిపదికన బాగు చేయిస్తున్నాం. గ్రామాల్లో 100 శాతం ఇళ్లకు తాగునీటి కనెక్షన్లు అందించడంతో పాటుగా, ప్రతి వీధిలో కూడా సీసీ రోడ్లు నిర్మిస్తున్నాం.. మరోవైపు పార్కుల అభివృద్ధికి మున్సిపాలిటీల నుండి నిధులు సమీకరిస్తాం. అయితే వాటి సంరక్షణ బాధ్యతల్ని స్థానికులే చూసుకోవాలి. ప్రజలంతా అభివృద్ధిలో భాగస్వాములైతే ప్రభుత్వ లక్ష్యాలను వీలైనంత త్వరగా సాకారం చేసుకునే వీలు కలుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యల్ని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థల్ని కూడా ఏర్పాటు చేసుకుంటున్నాం. మార్గదర్శకులు – బంగారు కుటుంబాలు కార్యక్రమాన్ని కూడా బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్తున్నాం. పేదరిక నిర్మూలన కోసం సమాజంలోని అసమానతలను నిర్మూలించడం కోసం పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కావాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ బాపిరాజు,గోపు సత్యనారాయణ, కుంచె నాని, కాగిత వెంకటేశ్వరావు, లోగిసేట్టి స్వామి,కొక్కిలిగడ్డ రమేష్, పీవీ పనికుమార్ టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదరిక నిర్మూలనలో భాగస్వామ్యం అవ్వండి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సమాజంలోని పేదరిక నిర్మూలనలో భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఉయ్యూరు శ్రీ విశ్వశాంతి విద్యాసంస్థల యాజమాన్యాన్ని కోరారు. సోమవారం ఉదయం ఆయన జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి ఉయ్యూరు మండలంలోని శ్రీ విశ్వశాంతి విద్యాసంస్థలను సందర్శించారు. సంస్థ చైర్మన్ మాదల సుబ్రహ్మణ్యేశ్వర రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సూర్యశేఖర్ తదితరులతో చైర్మన్ చాంబర్లో సమావేశమై రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి-4 కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. పి-4 ఒక వినూత్నమైన కార్యక్రమం అని పేర్కొంటూ, జీవితంలో ఉన్నతంగా స్థిరపడిన ధనికులను గుర్తించి, వారిని బంగారు కుటుంబాలతో ఆన్లైన్లో అనుసంధానం చేసి, పేదలను దత్తత తీసుకొని వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేయడం ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యం అన్నారు. బంగారు కుటుంబాలుగా గుర్తించిన వారిలో అవసరం ఉన్నవారికి ఆర్థిక సహాయం చేయడం, వస్తు సేవల రూపంలో చేయూత అందించడం, పిల్లల చదువుకు ఖర్చును భరించడం, ఇళ్ళ నిర్మాణాలకు సహకారం అందించడం, ఉపాధి కల్పించడం తదితర సేవలను మార్గదర్శకుల ద్వారా అందించి పేదల స్థితిగతులను మార్చాలన్నదే ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమం మొత్తాన్ని సమన్వయం చేసేందుకు గానూ జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ చాప్టర్ అనే ఆన్లైన్ వేదిక ఏర్పాటు చేశామని, దీనిలో అధికారులతో పాటు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ప్రముఖ వ్యక్తులు, సామాజిక కార్యకర్తలు తదితర అనధికారిక వ్యక్తులు ఉంటారన్నారు. ఎంతో మంది పేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తూ సామాజిక స్పృహ కలిగిన శ్రీ విశ్వశాంతి విద్యాసంస్థలు ఈ కార్యక్రమంలో మరింత భాగస్వామ్యం కావాలని, పేదరిక నిర్మూలనకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. జిల్లాలో తాము గుర్తించిన గ్రామాలలో నచ్చిన గ్రామం లేదా కుటుంబాలను దత్తత తీసుకోవాలని, లేదా సంస్థలోని బోధనేతర సిబ్బంది, తోటపని, పారిశుద్ధ్యం, వంట చేసేవారు, డెయిరీలో పని చేసేవారిని దత్తత తీసుకొని వారి అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. అదేవిధంగా దేశ విదేశాల్లో జీవితంలో ఉన్నతంగా స్థిరపడిన విద్యాసంస్థల పూర్వ విద్యార్థుల జాబితా అందించాలని, దీని ద్వారా పి-4 కార్యక్రమానికి వారి సహకారం కోరుతామన్నారు. పి-4 కార్యక్రమంపై స్పందించిన సంస్థ చైర్మన్ మాట్లాడుతూ కార్యక్రమం లక్ష్యం నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నామని, కుల మత ప్రాంత పార్టీలకతీతంగా ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ నిజాయితీ, నిబద్ధత కలిగిన అధికారి ఉండటం జిల్లాకు ఎంతో గర్వకారణమని ఆయన ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో కె ఆర్ ఆర్ సి ఎస్డీసి కలెక్టర్ శ్రీదేవి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి, మార్క్ ఫెడ్ డిఎం మురళీ కిషోర్, మండల ప్రత్యేక అధికారి జె జ్యోతి, శ్రీ విశ్వశాంతి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాదల సుష్మ, ప్రిన్సిపల్ పద్మజావాణి, వైస్ ప్రిన్సిపల్ రుద్ర కుమారి, సిపిఓ ఎస్ భీమరాజు, డిఎల్డీఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా శక్తి పంప్స్ లిమిటెడ్ క్యూఐపీ ఇష్యూ ముగింపు




విజయవాడ, జూలై 7, మేజర్ న్యూస్ : శక్తి పంప్స్ (ఇండియా) లిమిటెడ్ సంస్థాగత పెట్టుబడిదారులకు దాని క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) ఇష్యూను విజయవంతంగా ముగించినట్లు ప్రకటించడానికి సంతోషంగా ఉంది, దీని ద్వారా రూ.292.60 కోట్లు సేకరించారు. క్యూఐపీ ఇష్యూకు ఇప్పటికే ఉన్న, కొత్త ప్రముఖ సంస్థాగత పెట్టుబడిదారుల నుండి అద్భుతమైన స్పందన లభించింది, ఇది కంపెనీ భవిష్యత్తు వృద్ధి అవకాశాలు, మొత్తం పనితీరుపై వారి విశ్వాసాన్ని ప్రదర్శిస్తుంది. క్యూఐపీ నుండి వచ్చే ఆదాయాన్ని మధ్యప్రదేశ్‌లోని పీతంపూర్‌లో 2.20 జిడబ్ల్యూ ఉత్పత్తి సామర్థ్యంతో దాని అనుబంధ సంస్థ శక్తి ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్ ద్వారా గ్రీన్‌ఫీల్డ్ హై ఎఫిషియెన్సీ సోలార్ డీసీఆర్ సెల్, సోలార్ పీవీ మాడ్యూల్స్ తయారీ కర్మాగారాన్ని స్థాపించడానికి ఉపయోగించబడుతుంది. సోలార్ డీసీఆర్ సెల్‌ల యొక్క అంతర్గత తయారీ వెనుకబడిన ఇంటిగ్రేషన్‌ను మెరుగుపరుస్తుంది, మొత్తం విలువ గొలుసుపై ఎక్కువ నియంత్రణను అనుమతిస్తుంది, తద్వారా కంపెనీకి ప్రయోజనం చేకూరుతుంది. క్యూఐపీ ఇష్యూ ధర ఒక్కో షేరుకు రూ.918.00గా నిర్ణయించబడింది, ఇది సెబీ ఫ్లోర్ ధర అయిన రూ.965.96 కంటే 4.97% తగ్గింపు, ఈ ఆదాయం కంపెనీ ఆర్థిక స్థితిని మరింత బలోపేతం చేస్తుంది, దాని వ్యూహాత్మక లక్ష్యాలను సాధించడానికి వీలు కల్పిస్తుంది. శక్తి పంప్స్ (ఇండియా) లిమిటెడ్ చైర్మన్ దినేష్ పాటిదార్ మాట్లాడుతూ, "మా క్యూఐపీ ఇష్యూకు వచ్చిన ఉత్సాహభరితమైన ప్రతిస్పందనతో మేము చాలా సంతోషిస్తున్నాము. ఈ విజయవంతమైన నిధుల సేకరణ మా పెట్టుబడిదారులు మా వ్యాపార నమూనా, వృద్ధి వ్యూహంపై కలిగి ఉన్న నమ్మకాన్ని నొక్కి చెబుతుంది. మా వృద్ధి చొరవలను ముందుకు తీసుకెళ్లడానికి, అన్ని వాటాదారులకు విలువను పెంచడానికి ఈ నిధులను ఉపయోగించుకోవడానికి మేము ఆసక్తిగా ఉన్నాము. శక్తి పంప్స్ తన పెట్టుబడిదారుల నిరంతర మద్దతు కోసం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తుంది, కంపెనీకి ఆశాజనకమైన భవిష్యత్తును అంచనా వేస్తుంది."

## భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



అవనిగడ్డ, మేజర్ న్యూస్ : స్థానిక గీతా మందిరంలో ప్రతిష్ట మహోత్సవాలు ముగిసిన సందర్భంగా ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం భక్తిశ్రద్ధలతో 108 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని మండల పరిషత్ అధ్యక్షురాలు తుంగల సుమతీ దేవి ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమానికి ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనగా అశ్వరావు పాలెం మోదుమూడి వేకనూరు గ్రామాల నుండి వచ్చిన భక్తులు హనుమాన్ చాలీసా పారాయణంతోపాటు భజనలు, భక్తి గీతాలు ఆలపించారు. ఆలయ ధర్మకర్త యార్రం శెట్టి శ్రీహరిబాబు అరుణకుమారి దంపతులు కదళీ ఫలం, నాగవల్లి దళాలతో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేసి అన్న సమారాధన నిర్వహించగా వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

## శాంతి కళ్యాణంతో ముగిసిన పవిత్రోత్సవాలు



అవనిగడ్డ మేజర్ న్యూస్ : స్థానిక శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారి ఆలయంలో గత మూడు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు శాంతి కళ్యాణంతో ఘనంగా ముగిశాయి. సోమవారం ఉదయం ఆగమ పండితులు భట్టార్ శతృఘ్న చార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమాలలో ధర్మకర్తలు పోతు రాజు భాస్కర్ రావు అన్నపూర్ణ దంపతులు శాంతి కళ్యాణం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. తొలుత విష్వక్సేన ఆరాధన,కుంభారాధనం, మహా పూర్ణాహుతి, కుంభప్రోక్షణ,పవిత్ర విసర్జన కార్యక్రమాలు కనుల పండుగగా నిర్వహించారు. ఆదివారం రాత్రి జరిగిన స్వామి వారి గ్రామోత్సవం లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా పురవీధులలో ఇంటింటి వద్ద స్వామివారికి కొబ్బరికాయలు పూలు పళ్ళు కానుకలు సమర్పించారు కార్య నిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు..

## నేడు జరిగే వైసీపీ విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలి

పమిడిముక్కల జులై 7 మేజర్ న్యూస్: ఈనెల 8వ తేదీ పామర్రు ఆరేపల్లి కళ్యాణ మండపంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే బాబు షూరిటీ మోసం గ్యారెంటీ సన్నాహక సమావేశం జయప్రదం చేయాలని కోరుతూ మండల నాయకులు సోమవారం గ్రామాల్లో పర్యటించారు. మండల పార్టీ అధ్యక్షులు యలమంచిలి గణేష్ బాబు, మండల వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, వాలంటరీ విభాగం జిల్లా అధ్యక్షులు పోలిమెట్ల వంశీకృష్ణ, మొవ్వ మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ కొడాలి రాంబాబు మండల పార్టీ కార్యదర్శులు గొర్నిపూడి బుజ్జి, కనుమూరు వెంకటేశ్వరరావు తదితరులు మండల పరిధిలోని గ్రామాలలో పర్యటిస్తూ వైసిపి కార్యకర్తలను సమాయత్తం చేయాలని పిలుపునిచ్చారు.

## ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నందిగామ, జులై 7, మేజర్ న్యూస్: ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మాదిగ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హనుమంతుపాలెం 19 వ వార్డు ఎస్సీ కాలనీలో వర్గీకరణ సాధించిన మొదటిసారిగా ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా 19వ వార్డు టీడీపీ నాయకుడు రాటకొండ చంద్రశేఖర్,ఎలక్ట్రికల్ రిటైర్డ్ ఏఈ మంద ప్రభాకర్ రావు మాదిగ చేతుల మీదగా జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. అనంతరం సామాజిక ఉద్యమాల పితామహుడు, ఎమ్మార్పీఎస్ ఉద్యమ సృష్టికర్త, మాదిగల మహాత్ముడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ అన్న పుట్టినరోజుని పురస్కరించుకొని ఉప్మా, కేకులు పిల్లలకు, పెద్దలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో 19 వ వార్డు టీడీపీ నాయకులు రాటకొండ చంద్రశేఖర్, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ రిటైర్డ్ ఏఈ మంద ప్రభాకర్ మాదిగ,మంద యాకోబు మాదిగ, కత్తుల శీను మాదిగ, మంద జాన్ పీటర్ మాదిగ, వేల్పుల వెంకట్రావు మాదిగ, మంద గున్నయ్య మాదిగ, మంద మహేష్ మాదిగ, కత్తుల రవికుమార్ మాదిగ, తదితర మాదిగ సోదరీ సోదరీమణులు పాల్గొన్నారు

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



జి.కొండూరు మేజర్ న్యూస్ : మైలవరం మండలం కీర్తిరాయుని గూడెం గ్రామంలో ఎమ్మార్పీఎస్ 31 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న దొండపాటి విజయ్ కుమార్ ఎంఆర్పిఎస్ జెండా ఆవిష్కరించి, మందకృష్ణ మాదిగ విశిష్టతను, రిజర్వేషన్ కోసం ఆయన 31 సంవత్సరాలుగా పడిన కష్టాన్ని మాదిగ సోదరులకు తెలియజేసిన అనంతరం మాదిగ జాతి రాజకీయంగా ఏ పార్టీలో ఉన్న అందరూ ఎటువంటి గొడవలకు పోకుండా ఐక్యమత్యంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొంగల రామారావు, మట్టకొయ్య సుందరం, కుల పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ సాయం

గూడూరు మేజర్ న్యూస్ : గూడూరు మండలం పోలవరం గ్రామంలో గృహ దహనమై సర్వం కోల్పోయిన. మురాల లక్ష్మీ కుమారి బాధితురాలి కుంభానికి కృష్ణాజిల్లా రెడ్ క్రాస్ సెక్రటరీ శంకర్ నాథ్ భవిరి, ట్రెజరర్ కొండపల్లి రామ్ బాలాజీ, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ హరికృష్ణలు బాధిత కుటుంబానికి వంట పాత్రలు తాత్కాలిక నివాసం కొరకు టార్పాలిన్ బకెట్ తదితర వస్తువులను అందజేశారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితుల సహాయంలో రెడ్ క్రాస్ ముందుంటుందని అలాంటి రెడ్ క్రాస్ లో అవకాశం ఉన్న ప్రతి ఒక్కరు సేవా దృక్పథంతో సభ్యులు కావాలని సెక్రటరీ కోరారు.ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్ పడవల మోహన్ త్రినాథ్ ప్రసాద్ ఇతరులు పాల్గొన్నారు

## ఏస్ ప్రోను ఆవిష్కరించిన టాటా మోటార్స్




విజయవాడ, జూలై 7, మేజర్ న్యూస్ : భారతదేశ అతిపెద్ద వాణిజ్య వాహన తయారీదారు అయిన టాటా మోటార్స్ సరికొత్త టాటా ఏస్ ప్రోను ప్రారం భించడం ద్వారా చిన్న కార్గో మొబిలిటీలో కొత్త మైలురాయిని సృష్టిస్తూ, చిన్న కా ర్గో మొబిలిటీలో పరివర్తన యుగానికి నాంది పలికింది. కేవలం రూ.3.99 లక్షల సాటిలేని ప్రారంభ ధరతో, టాటా ఏస్ ప్రో భారతదేశంలో అత్యంత సరసమైన నాలుగు చక్రాల మినీ ట్రక్. ఇది అసాధారణ సామర్థ్యం, సాటిలేని బహుముఖ ప్రజ్ఞ, ఉన్నతమైన విలువను అందిస్తుంది. కొత్త తరం వ్యవస్థాపకులకు సాధికారత కల్పించడానికి రూపొందించబడిన టాటా ఏస్ ప్రో పెట్రోల్, రెండు రకాల ఇంధనం (సీఎన్జీ ప్లస్ పెట్రోల్), ఎలక్ట్రిక్ వేరి యంట్లలో లభిస్తుంది. దేశవ్యాప్తంగా ఉన్న టాటా మోటార్స్ 1250 వాణిజ్య వాహనాల అమ్మకాల టచ్ పాయింట్లలో లేదా టాటా మోటార్స్ ఆన్‌లైన్ అమ్మ కాల ప్లాట్‌ఫామ్ అయిన ఫ్లీట్ వెర్స్‌లో కస్టమర్లు తమకు నచ్చిన ఏస్ ప్రో వేరియంట్‌ను బుక్ చేసుకోవచ్చని టాటా మోటార్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరీష్ వాఘ్ తెలిపారు.

## పాడి రైతులు పచ్చి గడ్డి సాగు చేయాలి

### పశుగ్రాస వారోత్సవాల్లో డాక్టర్ నాగభూషణం




అవనిగడ్డ మేజర్ న్యూస్ : పాడి రైతులు తప్పని సరిగా ఖర్చుపెట్టి సాగు చేసుకోవాలని, పాడిఆవులకు పచ్చిమేత వేయడం వల్ల అధిక పాల ఉత్పత్తులు సాధించవచ్చని మచిలీపట్నం పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డా.ఎస్. నాగభూషణం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఏరియా వెటర్నరీ హాస్పిటల్ ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో పశుగ్రాస వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాడి రైతులతో సమావేశంలో మాట్లాడుతూ తప్పని సరిగా పాడి రైతులు పచ్చిగడ్డి సాగు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలఉత్పత్తిలో అధిక దిగుబడులు సాధించడానికి పప్పుజాతి, ధాన్యం జాతి, గడ్డిజాతి, పశుగ్రాసాలను పాడి రైతులు పశువులకు అందించాలని వివరించారు. అలసంద, పిల్లిపెసర, లూసర్న్ వంటి పప్పు జాతిగడ్డిలో మాంసకృత్తులు అధికంగా ఉంటాయన్నారు. జొన్న, మొక్కజొన్న వంటి ధాన్యం జాతి, గడ్డిజాతి గ్రాసం ద్వారా పశువులకు వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొరుముచ్చు ఉమాదేవి, వెటర్నరీ హాస్పిటల్ అసిస్టెంట్ డైరెక్టర్ డా.బి.సాంబశివరావు, రైతులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## బుద్ధుని పై దాడి దేశానికే అవమానం



అవనిగడ్డ, మేజర్ న్యూస్ : గౌతమ బుద్ధుని విగ్రహాన్ని అవమానకరంగా తల మన్యం వేరు చేసిన ఘటన దేశ ప్రతిష్టకి భంగం వాటిల్లేలా ఉందని ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు దోవా గోవర్ధన్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు జిల్లా మదనపల్లి రూరల్ లంకిశెట్టి పల్లెలో గౌతమ బుద్ధుని విగ్రహానికి జరిగిన అవమానాన్ని ఈ దేశ ప్రతిష్టను అపహాస్యం చేసిన సంఘటనగా ప్రభుత్వం గుర్తించి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ దేశంలో పుట్టిన బౌద్ధం ప్రపంచ దేశాల్లో ప్రసిద్ధి చెందుతుంటే ఇక్కడ దౌంసం చేయబడుతోందని ఆవేదన వ్యక్తం చేసారు, బుద్ధుడు ప్రజ్ఞ, శీల, కరుణ, అనే మానవ నైతిక తత్వాన్ని ప్రజలకు బోధించాడని ప్రపంచంలో బుద్ధుడే మహోన్నత జ్ఞాన శిఖరం అన్నారు, అలాంటి మహా బోధి తలను ఈ నేలపై ధ్వాసం చేస్తే ఈ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని గోవర్ధన్ ప్రశ్నించారు. అశోకుడి ధర్మ పాలన భారత రాజ్యాంగ మౌలిక స్వరూపాలు బుద్ధుడి ఆనవాళ్ళేనని అలాంటి గౌతమ బుద్ధుని పై దాడి జరిగితే రాష్ట్ర ప్రభుత్వం స్పందించక లేక పోవడం బాధాకరమన్నారు.దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు.

## వృద్ధాశ్రమంలో పండ్లు రొట్టెలు బిస్కెట్లు పంపిణీ



నాగాయలంక జులై 8 మేజర్ న్యూస్ : పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 60వ ఏట జన్మదిన సందర్భంగా నాగాయలంక గవర్నమెంటు ఆసుపత్రిలో వృద్ధాశ్రమంలో పండ్లు రొట్టెలు బిస్కెట్లు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పేదలకు వృద్ధులకు పంచి పెట్టి వారి ఆరోగ్యపరిస్థితులపై ఆరా తీశారు. కార్యక్రమంలో తానంకి పోతురాజు కైతేపల్లి నరేష్ కైతేపల్లి ఆనంద్ గాజులేటి మధుబాబు కైతేపల్లి బుజ్జిబాబు పాల్గొని కార్యక్రమము జయప్రదం చేశారు.



## అధికారులకు అక్రమ మైనింగ్ కనబడటం లేదా?

**పెడన, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం నుండి ఆ పార్టీ నాయకులు స్థానిక ఎమ్మెల్యే ప్రోత్బలంతో అక్రమ మైనింగ్ చేస్తూ అడ్డు వచ్చిన వారిని గుద్దుకుంటూ పోతున్నారని దీనిపై పోలీసు రెవెన్యూ పంచాయతీ ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని ఏపీ కాంగ్రెస్ పార్టీ ఓ బి సి చైర్మన్ సొంటి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మండల ఇంచార్జ్ తాసిల్దార్ కె అనిల్ కుమార్ కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సొంటి మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ నాయకులు విచ్చలవిడిగా అక్రమ మైనింగ్ పాల్పడి కోట్లాది రూపాయలు వెనక వేసుకుంటున్నారని అధికారులు కూడా అధికార పార్టీతో ఎదురు వెళ్లలేక ఏమి చేయలేని దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక రాత్రి వేళలో విపరీతంగా పరిమితికి మించిన లోడ్ తో టిప్పర్లు తిరుగుతూ అడ్డు వచ్చిన వారిని గుద్దుకుంటూ వెళ్తున్నారని దీంతో వారు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వచ్చిందని అన్నారు. ఆదివారం రాత్రి కుదూరు గ్రామంలో ఇలాగే జరిగిందని హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం తో ప్రాణాపాయం తప్పిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ అక్రమ మైనింగ్ని ఆపకపోతే ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ మన్నం రాజశేఖర్, మచిలీపట్నం కాంగ్రెస్ కోఆర్డినేటర్ అబ్దుల్ మతిన్, సనపల రమేష్ ఉన్నారు.

## మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**పామర్రు జూలై 7 మేజర్ న్యూస్ :** మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పామర్రు శాఖ 2025–2026 సం.కు నూతనంగా ఎన్నిక కాబడిన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం పామర్రులోని శ్రీ అంకమ్మ తల్లి దేవ స్థానం ఆవరణలో జరిగింది. నూతన అధ్యక్షులుగా నూతలపాటి త్రివిక్రమ రావు (ఎన్.టీ.ఆర్), కార్యదర్శిగా అరిగెల బాలుడు, కోశాధికారిగా భీమవరపు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులుగా అల్లాడ సోమశేఖరరావు, సంయుక్త కార్య దర్శిగా బొందు సుధాకరరావు, ఈసీలుగా కేసాని రవీంద్రబాబు(అవేర్ నెస్), తుంగల వేణుగోపాలప్రసాద్(విద్య), కొల్లా శ్రీనివాసరావు(విద్య), మండ కమలకరనాథ్(ఎమర్జెన్సీ)లతో కూడిన నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. మానవత సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్, ఉభయ కృష్ణాజిల్లా చైర్మన్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పామర్రులోని వాసు స్వీట్స్ అధినేత నూకల రమేష్ తన తండ్రి జ్ఞాపకార్థం వితరణ చేసిన ఫ్రీజర్ బాక్స్ను నూతన కమిటీ సమక్షంలో మారుబోయిన కోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పొట్లూరి శేషగిరి రావు, పి.ఎం.ఎస్. ప్రసాద్, సీతాల ప్రసాద్, జె.వి.వి.సత్య నారా యణ, పామర్తి వెంకట నారాయణ, విజయలక్ష్మి పాల్గొని ప్రసంగించి, నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు.

## బదిలీ అయిన ఉపాధ్యాయులకు సత్కారం



**పమిడిముక్కల జులై 7 మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన పమిడిముక్కల లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు వి.కేశవ నారాయణ, ఉపాధ్యాయులు ఎన్.అరుణ, వి.కోటేశ్వరరావు లు బదిలీ కాగా వారికి పాఠశాల విద్యా కుటుంబం తరపున ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.దుర్గాభవాని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యం.శ్రీకుమార్, జి.రామకృష్ణ, రామాంజనేయులు, పి.డి.ఇ.వెంకట నారాయణ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉద్యోగావకాశాల కల్పనకు జాబ్‌మేళాలు నిర్వహించండి

**ఉపాధి అవకాశాలు పొందేలా యువతకు శిక్షణ అందించండి..**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.**

**విజయవాడ, మేజర్ న్యూస్ :** నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు పొందేలా జాబ్ మేళాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ఉపాధి, శిక్షణ శాఖ అధికారులకు సూచించారు. స్వర్ణాంధ్ర 2047 దార్శనిక ప్రణాళికకు అనుగుణంగా దశల వారీ లక్ష్యాలను సాధించేందుకు కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇగ్నైట్ సెల్‌ను కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు మెరుగైన ఉద్యోగావకాశాలను కల్పించేందుకు జాబ్‌మేళాలను నిర్వహించాలన్నారు. అవసరమైన వారికి నైపుణ్య శిక్షణను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకునేలా విస్తృత పచారం కల్పించాలన్నారు. యువతకు సుస్థిర ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ఈ ఏడాది ఇప్పటి వరకు 53 జాబ్ మేళాలను నిర్వహించి సుమారు 900 మందికి పైగా ఉపాధి అవకాశాలను కల్పించడం అభినందనీయమన్నారు. పదోవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తిచేసి అర్హత కలిగిన వారికి ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ఈ నెలలో మెగా జాబ్‌మేళాను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ఇగ్నైట్ సెల్ సందర్శనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా ఉపాధి కల్పన అధికారి సి. మధుభూషణ్‌రావు, ఉపాధి కల్పన అధికారి (ఒకేషనల్ అండ్ గైడెన్స్) వైఎస్ బ్రహ్మం, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎస్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



## యు.ఎఫ్.ఆర్టీఐ జిల్లా కన్వీనర్‌గా దుర్గాప్రసాద్



**తోట్లవల్లూరు జూలై 7 మేజర్ న్యూస్:** యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ క్యాంపెయిన్ కృష్ణాజిల్లా కన్వీనర్ గా తోట్లవల్లూరు మండలం పెనమకూరుకు చెందిన బయ్యవరపు దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు యు.ఎఫ్.ఆర్టీఐ రాష్ట్ర కో కన్వీనర్ జంపాన శ్రీనివాస్ గౌడ్ దుర్గా ప్రసాద్ కు నియామక పత్రాన్ని అందజేశారు. నూతన కమిటీల ఏర్పాటులో భాగంగా కృష్ణా జిల్లా కన్వీనర్ గా దుర్గాప్రసాద్ ను నియమించినట్లు ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా యు.ఎఫ్.ఆర్.టి.ఐ. రాష్ట్ర నాయకులు, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్స్ ఆర్గనైజేషన్ చైర్మన్ దాసరి ఇమ్మానుయేల్, రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.రాజు లు దుర్గాప్రసాద్ ను అభినందించారు. తనపై నమ్మకంతో జిల్లా కన్వీనర్ గా నియమించిన శ్రీనివాస గౌడ్ కు ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నెరవేర్చి, ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తానని ఆయన పేర్కొన్నారు.

## పొగాకు ఉత్పత్తులపై ప్రత్యేక తనిఖీలు



**పామర్రు జులై 7 మేజర్ న్యూస్:** పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలో పొగాకు ఉత్పత్తులపై ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ సోమవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్ తమ సిబ్బందితో కలిసి పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల సమీపాల్లో ఉన్న పొగాకు ఉత్పత్తులు విక్రయించే దుకాణాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, 2003 పొగాకు నియంత్రణ చట్టం నిబంధనలు ఉల్లంఘిస్తున్న వ్యాపారులపై జరిమానాలు విధించారు. విద్యా సంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు అమ్మకానికి లేదు అనే బోర్డులు ఏర్పాటు చేయాలని వ్యాపారులకు ఈ సందర్భంగా ఎస్ఐ సూచించారు.

# అంతరాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసిన పామర్రు పోలీసులు

**పామర్రు జూలై 7 మేజర్ న్యూస్ :** పలు దొంగతనాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగలను పామర్రు పోలీసులు పట్టుకుని వారి వద్ద నుండి పెద్ద మొత్తంలో బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి గుడివాడ డి.ఎస్.పి వి.ధీరజ్ వినీల్ సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. జైలులో ఏర్పడిన పరిచేయాలతో ఐదుగురు వ్యక్తులు కలిసి ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈకేసులో అరెస్ట్ కాబడిన 5 గురు ముద్దాయిలకు గుడివాడ కు చెందిన గొడవర్తి కిరణ్ అలియాస్ లిక్కి అనే అతను గంజాయి వ్యాపారం చేస్తూ పట్టుబడి జైలుకు వెళ్లి పై ముద్దాయిలకు ఒకరితో ఒకరికి జైలు లో స్నేహము కుదిరిందన్నారు. వీరందరూ గంజాయి, మందు తాగటానికి గుడివాడ కు చెందిన గొడవర్తి కిరణ్ వద్దకు వచ్చి గత మే నెల 22వ తేదీన వీరందరూ కలిసి నేరం చేయటానికి పాల్పడినట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. పామర్రు మండలం మలయప్పన్ పేటలో గతంలో జరిగిన చోరీకి సంబంధించి నిందితులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 22వ తేదీ రాత్రి మలయప్పన్ పేట గ్రామంలో సాలిమట్టి ప్రమీలారాణి ఇంటిలో తలుపులు పగల కొట్టి సుమారు 5 లక్షల రూపాయిల విలువ గల 16 కాసుల బంగారు నగలు, సెల్ ఫోన్ లు దొంగిలించారన్నారు. అనంతరం ఆ పక్కనే గల ఇంటి వద్దకు వెళ్ళగా వారు అలికిడికి లేచి గ్రామస్తుల సహకారంతో వెంటపడగా రెండు మోటార్ సైకిళ్ళపై గుడివాడ వైపు పారిపోయారని తెలిపారు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత ఫిబ్రవరి 23వ తేదీన పామర్రు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.అయితే ఈ కేసుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో పలు విధాలుగా కేసును దర్యాప్తు చేశామన్నారు. దొంగతనానికి వచ్చిన వారిలో ఒక మహిళ గొంతు వినిపించిందని గ్రామస్తులు చెప్పిన దానిపై ఆ దిశగా దర్యాప్తు కొనసాగించామని తెలిపారు. ఈ కేసు పై కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర రావు ఆధ్వర్యంలో గుడివాడ డిఎస్పి పర్యవేక్షణలో పామర్రు సిఐ వి.శుభాకర్, సి.సి.ఎస్.సిఐ వి.రమణమ్మ, పామర్రు ఎస్సై వి.రాజేంద్రప్రసాద్, సిసిఎస్ ఎస్ఐ ఎస్.ఎస్.దాసు లు రెండు బృందాలుగా ఏర్పడి ఈ కేసును సవాల్‌గా తీసుకొని దర్యాప్తు చేశారన్నారు. సాంకేతిక ఆధారాలు సేకరించడంతో పాటు



ఐఎంఈఐ నెంబర్లు సిగ్నల్ ఆధారంగా, సీసీ కెమెరాల ఆధారంతో దొంగలు పారిపోయిన వాహనాలను గుర్తించడం జరిగిందన్నారు. దీని ఆధారంగా దొంగతనంలో పాల్గొన్న ఉయ్యూరు కు చెందిన అబ్దుల్ షబ్బీర్ (19 సం), ఏలూరుకు చెందిన ట్రాన్స్ జెండర్ షేక్ మున్న అలియాస్ సిరి (19 సం.), కాకినాడకు చెందిన కొటారి శ్రీనివాసు అలియాస్ శ్రీను అలియాస్ వాసు (36 సం), గుడివాడ నైజంపేటకు చెందిన తిరుమలశెట్టి ధనుష్ అలియాస్ పాండు (18 సం), గుడివాడ బేతవోలుకు చెందిన ప్రత్తిపాటి సంజయ్ (19 సం) లుగా గుర్తించామన్నారు.

వీరందరినీ అరెస్ట్ చేసి ఈ కేసులో బాధితురాలు పోగొట్టుకున్న బంగారపు వస్తువులు, సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరందరిపై గతంలో పలు పోలీస్ స్టేషన్ లలో కేసులు ఉన్నాయన్నారు. వీరిలో అబ్దుల్ షబ్బీర్ పై విజయవాడ సిటీలో వేరువేరు పోలీస్ స్టేషన్ లలో ఆరు దొంగతనం కేసులు ఉన్నాయన్నారు. ట్రాన్స్ జెండర్ షేక్ మున్నా పై పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లా, కైకలూరులలో మొత్తం 12 కేసులు ఉన్నాయని, అలాగే కొటారి శ్రీనివాస్ పై విజయవాడ, పశ్చిమగోదావరి జిల్లా, చిత్తూరు, ఒంగోలులో 20 కేసులు ఉన్నాయన్నారు. వీరు నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్ లో ఉండగా స్నేహితులుగా మారారని డిఎస్పి తెలిపారు. అరెస్ట్ చేసిన నిందితులను గుడివాడ కోర్టులో హాజరు పరిచినట్లు డిఎస్పి ధీరజ్ వినీల్ తెలిపారు. కావున ప్రజలందరు అప్రమత్తంగా ఉండి వారి స్తోమతను బట్టి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవలసిందిగా డిఎస్పి విజ్ఞప్తి చేశారు.

# మచ్చలేని మహా నేత.... నిష్కలంక ప్రజా సేవకులు చనమోలు వెంకట్రావు



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మచ్చలేని మహా నేత, నిష్కలంక ప్రజా సేవకులు చనమోలు వెంకట్రావు అని కొండపల్లి మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం ఫెర్రీ రోడ్లో దివంగత నేత, మాజీ మంత్రి చనమోలు వెంకట్రావు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పూలమాలలు వేసి సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ "దివంగత నేత, మాజీ మంత్రి వర్యులు, మైలవరం నియోజకవర్గంలో అభివృద్ధికి పునాదులు వేసిన మహనీయులు, నిష్కలంక ప్రజా సేవకులు దివంగత నేత మాజీమంత్రి చనమోలు వెంకట్రావు సేవలు చిరస్మరణీయం. పవర్ పాలిటిక్స్ లో ఇటువంటి మహానాయకులు నేటి యువతరం నాయకులకు స్ఫూర్తిదాయకం. ఓర్పు, సహనం, ప్రశాంతత, సమయస్ఫూర్తి, తెలివితేటలు, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం, అంకితభావంతో పని చేయడం చనమోలు వెంకట్రావు క్రమశిక్షణతో కూడిన రాజకీయ జీవితానికి తార్కాణాలు." అని వక్తలు పేర్కొన్నారు.



### కొండపల్లి మున్సిపాలిటీ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

**జి కొండూరు మేజర్ న్యూస్ :** పెర్రీ రోడ్డు లో కాంగ్రెస్స్ పార్టీ ఆద్వర్యంలో మాజీ మంత్రి స్వర్గీయ చనమోలు వెంకట్రావు 17 వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మైలవరం నియోజకవర్గంతో పాటు రాష్ట్రాభివృద్ధిలో మాజీ మంత్రి చనమో లు వెంకట్రావు తనదైన ముద్ర వేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ఇబ్రహీం పట్నం ఫెర్రీ రోడ్ లో గల చనమోలు విగ్రహానికి జిల్లా డీసీసీ అధ్యక్షులు బొర్రా కిరణ్,సీనియర్ పార్టీ నాయకులు జువ్వా వాసు, చిలుకూరు సర్పంచ్ గొంది సురేష్,చనమోలు అభిమానులు పాల్గొని వారి విగ్రహానికి పూలమాలలువేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన మైలవరం నుండి 5 సార్లు మైలవరానికి శాసనసభ్యునిగా, పలు మార్లు రాష్ట్ర మంత్రిగా కీలక శాఖలలో ప్రాతినిధ్యం వహించి మన ప్రాంతానికి,మన జిల్లా, ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లటంలో చనమోలు పాత్ర మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్స్ పార్టీ నాయకులు జువ్వా వాసు,సర్పంచ్ గొంది సురేష్,అక్కల ప్రసాద్,చెరుకు ఆనందరావు, చనమోలు రాము,బొర్రా భుసంకరరావు,గోరె సాహెబ్, యలమంచిలి కోటేశ్వరరావు, కే.లింగరాజు, ఉప్పుతల శ్రీను, వీరాంజనేయులు పాల్గొన్నారు.

### నివాళులర్పించిన ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ



**జి కొండూరు మేజర్ న్యూస్ :** జి. కొండూరు గ్రామంలో దివంగత నేత మాజీ మంత్రి చనుమోలు వెంకట్రావు 17వ వర్ధంతి సందర్భంగా కొత్తూరు రోడ్డు వద్ద గల వైయస్సార్, చనుమోలు వెంకట్రావు విగ్రహాలకు స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులతో కలిసి జి.కొండూరు మండల ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మపూలమాలలు వేసినివాళులార్పించారు. పేదలకు పండ్లు పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మండల అరుణ, మాజీ కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ వేములకొండ రాంబాబు, సీనియర్ నాయకులు వేములకొండ సాంబశివరావు, మందా కాంతయ్య, పజ్జూరు కృష్ణ రావు,దోప్పల రాంబాబు, భాస్కర్ రావు, ముత్తయ్య గ్రామ పార్టీ అధ్యక్షులు వేములకొండ విష్ణు, రామయ్య, నాగరాజు, పజ్జూరు కిషోర్, గోపి పాల్గొన్నారు.

### నూతన వధూవరులను ఆశీర్వదించిన వర్ల కుటుంబసభ్యులు



**పామర్రు జూలై 7 మేజర్ న్యూస్:** మంగళగిరిలో సోమవారం జరిగిన వర్ల రత్నకుమారి కుమార్తె వివాహ వేడుకలలో తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజాలు కుటుంబ సభ్యులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి రత్న కుమారి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# గ్రామ అభివృద్ధి కార్యక్రమంపై విమర్శలు చేస్తే సహించేది లేదు

### ఏ పార్టీయో తెలియని వ్యక్తి ఎమ్మెల్యేను విమర్శించటం హాస్యాస్పదం

### మోదుమూడి గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే విస్తృత సహకారం అందిస్తున్నారు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** గ్రామ అభివృద్ధి కార్యక్రమంపై బురద చల్లేలా ఒక వ్యక్తి చేసిన విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మోదుమూడి సర్పంచ్ బచ్చు బేబీ, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు బచ్చు వెంకట నారాయణ స్పష్టం చేశారు. సోమవారం అవనిగడ్డ మండలం మోదుమూడి గ్రామ పంచాయతీ ఆవరణలో వారు మీడియాతో మాట్లాడారు. ఇటీవల తమ గ్రామంలో సాగునీటి అవసరాలకు వినియోగించే చెరువును తహసీల్దార్ అనుమతితో, గ్రామ పంచాయతీ తీర్మానం చేసి పాఠశాల మెరక పనులకు, గ్రామ అభివృద్ధి పనులకు మట్టి వినియోగించినట్లు స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ చెరువు తవ్వే వీడియోలు వినియోగించి ఒక వ్యక్తి మోదుమూడిలో అక్రమ తవ్వకాలు – ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు సంబంధం అని ఇష్టారాజ్యంగా నోటికి వచ్చిన అవాస్తవాలను సోషల్ మీడియాలో వైరల్ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేసిన అభివృద్ధి పనిపై ఒక వ్యక్తి పనిగట్టుకుని విమర్శలు చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో మచ్చ లేకుండా నీతి నిజాయితీలతో ప్రజా సేవ చేస్తున్న అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాదుకు, వారి కుటుంబ సభ్యులకు ఉద్దేశపూర్వకంగా అపఖ్యాతి కలిగించేందుకు ప్రయత్నం చేసిన వ్యక్తి అసలు ఏ పార్టీలో ఉన్నాడో అతనికైనా తెలుసా? అని వెంకట నారాయణ ప్రశ్నించారు. అతను వైసీపీకి చెందిన వ్యక్తి కాదని స్వయంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నానీ సాక్షి పత్రికలో ప్రకటన కూడా ఇచ్చారని గుర్తు చేశారు. వైసీపీ సభ్యత్వం కూడా పొందలేని వ్యక్తి తానేదో వైసీపీ నియోజకవర్గ నాయకుడినని చెప్పుకుంటూ సోషల్ మీడియా అడ్డం పెట్టుకుని ప్రతి రోజు వాట్సాప్ గ్రూపుల్లో స్వయం ప్రచార పోస్టులు వైరల్ చేసుకుని దాన్నే రాజకీయం అనుకుంటే అంతకంటే హాస్యాస్పదం మరొకటి లేదన్నారు. ఇటీవల తమ గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన ఒక నాయకుడు తన ఇంటికి మట్టి తోలుకునేందుకు నిబంధనలకు విరుద్ధంగా తవ్వుతుంటే రెవిన్యూ అధికారులు వచ్చి అడ్డుకున్నారని తెలిపారు. ఆ ఘటన ఉదహరిస్తూ తమ పంచాయతీ చెరువు అధికారికంగా జరుగుతున్న పూడికతీత పనుల వీడియోను వినియోగించి సోషల్ మీడియాలో అవాకులు చెవాకులు జోడించి, ఎమ్మెల్యే కుటుంబంపై విమర్శలు చేస్తూ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టడం అతని అపరిపక్వతకు నిదర్శనం అన్నారు. ఈ వ్యక్తి ఎప్పుడూ ఇదే విధంగా గ్రూపుల్లో పోస్టులు పెడుతుంటే అతని అవివేకాన్ని గమనించి ప్రజలు అతనిని పట్టించుకోవటం మానేశారన్నారు. జనం ఊరుకున్నారు కదా అని ఇష్టం వచ్చినట్లు గ్రూపుల్లో పోస్టులు పెడితే జనం బుద్ది చెప్పటం ఖాయమన్నారు. గ్రామ పంచాయతీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమంపై బురద చల్లుతూ, ఏకంగా ఎమ్మెల్యేపైనే విమర్శలు చేస్తూ తన స్థాయిని తనకు తాను ఎక్కువగా ఊహించుకోవటం మురిసిపోవటం అతని పిల్ల చేష్టలకు నిదర్శనం అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తమ గ్రామంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సహకారంతో రూ.40 లక్షలతో నాలుగు సీసీ రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. ఆర్థిక సంఘం నిధులు కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీలకే ఇవ్వటంతో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. రైతుల సాగు నీటి అవసరాలు తీర్చటంతో పాటు పాఠశాల ఆవరణ మెరక చేసేందుకు చెరువు తవ్వినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామంలో మరెన్నో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



### బదిలీపై వెళ్తున్న ఏఎస్ఐకు సత్కారం

**పామర్రు జులై 7 మేజర్ న్యూస్:** పామర్రు పోలీస్ స్టేషన్‌లో ఏ.ఎస్.ఐగా పనిచేస్తున్న జి. వెంకటేశ్వరరావు గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్‌కు బదిలీ కాగా ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. పామర్రు సిఐ వి. శుభాకర్, ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్, స్టేషన్ సిబ్బంది బదిలీపై వెళ్తున్న ఏఎస్ఐ వెంకటేశ్వర రావును ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

### పార్థివ దేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే కైలే



**పామర్రు జులై 7 మేజర్ న్యూస్:** పామర్రు టౌన్‌లో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చౌదరి నాగేంద్ర సమీప బంధువు మరణించగా సోమవారం పామర్రు మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్‌తో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మెప్మా సంస్థ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబుకు పాలాభిషేకం



**నందిగామ, జులై 7, మేజర్ న్యూస్:** పట్టణంలోని నందిగామ పురపాలక సంఘ కార్యాలయంలో మెప్మా సంస్థల ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్స్ కాల పరిమితి పెంచిన కారణముగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ప్రభుత్వ విప్ స్థానిక శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య ఆదేశాలతో పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించిన నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో చైర్ పర్సన్ మాట్లాడుతూ మహిళ సాధికారిత కోసం ఎల్లప్పుడూ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మహిళలకు ఆర్థిక అసమానతలను దూరం చేస్తూ వారికి సహాయక సంఘాల ద్వారా చేయూతనిస్తూ వారి అభివృద్ధికి పాటుపడే దిశగా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి లోవ రాజు, ఏ ఈ ఫణి శ్రీనివాస్,పట్టణ పార్టీ అధ్యక్షులు ఏచూరి రాము, మెప్మా సీఎంఎంఏం సత్యవతి, సి ఓ లు, ఆర్పీలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

### పెనుమత్సలో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ, కృష్ణ మాదిగ జన్మదినోత్సవ వేడుకలు



**పమిడిముక్కల జులై 7 మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పెనుమత్స గ్రామంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పామర్రు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కొల్లూరి దినేష్ బాబుమాదిగ ఆద్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా అధ్యక్షుడు పసుమర్తి దినేష్ బాబుమాదిగ, గ్రామ సర్పంచ్ దండమూడి అచ్చమాంబ, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## బాలా త్రిపుర సుందరి అమ్మవారికి సారే



మొవ్వ జులై 7 మేజర్ న్యూస్ : మండల పరిధిలోని నాట్య క్షేత్రం కూచిపూడి శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో వేంచేసి ఉన్న శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారికి సోమవారం ఆషాడ మాస సారే ను కూచిపూడి పెదపూడి వాసవి వనిత క్లబ్ సభ్యులు దేవాలయ అర్చకులు పెనుమూడి సతీష్ కుమార్ శర్మకి నూతన వస్త్రాలు, పసుపు కుంకుమ, గాజులు, పండ్లు, పూలు, పూజ సామాగ్రిని అందించారు. తొలుత పెదపూడి విఘ్నేశ్వర స్వామి వారికి, గ్రామ దేవత అయిన గంగానమ్మకు ఆషాడ మాస సారెను వాసవి వనిత క్లబ్ సభ్యులు అందించి ఊరేగింపుగా వచ్చి బాలా త్రిపుర సుందరి అమ్మవారికి ఆషాడ మాస సారే ను అందించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## స్కేటింగ్ రోల్‌బాల్ ఇంటర్నేషనల్ క్రీడాకారుడు శ్రీశాంత్‌కు ఘన స్వాగతం



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** స్కేటింగ్ రోల్‌బాల్ క్రీడాకా రుడు మోటపర్తి శ్రీశాంత్‌కు గుడ్ల వల్లేరు మండలం వడ్లమన్నాడు శివా రు కొండిపాలెం వాసులు ఘన స్వాగతం పలికా రు. కెన్యాలో జరిగిన పోటీల్లో విజేతగా భారత జట్టు విజయం సాధిం చటంలో కీలక పాత్ర పోషించిన శ్రీశాంత్‌ను గ్రామంలో ఘనంగా సన్మానిం చారు. తల్లిదండ్రులతో కలిసి శ్రీశాంత్ స్వగ్రామానికి ఊరేగింపుగా వచ్చారు. కెన్యా దేశంలో జరిగిన స్కేటింగ్ రోల్‌బాల్ పోటీల్లో ఈ గ్రామానికి చెందిన మోటపర్తి శ్రీశాంత్ భారతదేశం తరపున తలపడి భారత్ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. దేశ ప్రజల మన్ననలు అందుకు న్నారు. ఆయన తాత రేణుకరాజుది గ్రామంలో సాధారణ రైతు కుటుంబం. ఆయన కుమా రుడు మోటపర్తి రాంబాబు సీఆర్పీఎఫ్‌లో చేరి చత్తీస్‌గఢ్‌లో విధులు నిర్వర్తిస్తు న్నారు. రాంబాబు కుటుంబం చాంద్రాయణగుట్ట సీఆర్పీఎఫ్ క్యాంప్‌లో ఉం టుంది. రాంబాబు, చైతన్య దంపతుల కుమారుడే శ్రీశాంత్ శివరాంపల్లి నేషనల్ పోలీస్ అకాడమీ కాలేజీలో ఇంటర్ చదువుకుంటున్నాడు. భారత్ జట్టుకు ఏపీ, తెలంగాణా తెలుగు రాష్ట్రాల తరపున తమ కుమారుడు శ్రీశాంత్ ఎంపికై గెలుపొంది పతకాన్ని సాధించటం గర్వకారణంగా ఉందని రాంబాబు, చైతన్య దంపతులు తెలిపారు. శ్రీశాంత్‌ను సన్మానించిన వారిలో గ్రామ ప్రముఖులు కేశన మహేష్, మన్నెం వీరయ్య, పామర్తి శ్రీను తదితరులు ఉన్నారు.

## విజయవాడ కనకదుర్గ అమ్మవారికి ఆషాడం సారె



**గన్నవరం, జులై 7, మేజర్ న్యూస్ :** గోవింద నామ ప్రచార సేవా సంఘం ఆధ్వర్యం లో గన్నవరం మండలం, సూరంపల్లి గ్రామం గంగానమ్మ గుడి, శ్రీ మద్ది రావమ్మ, పోతురాజు మీదగా శ్రీకోదండ రామాలయం దేవాలయం నుండి విజయవాడ కనకదుర్గ అమ్మవారికి ఆషాడం సారె సమర్పించారు. సోమవారం మహిళా కమిటీల సహకారంతో సూరంపల్లి గ్రామంలోని భక్తులందరూ ఎంతో భక్తి, శ్రద్ధలతో""జై దుర్గా" నామస్మరణంతో సూరంపల్లి గ్రామస్తులు శ్రీ కోదండ రామాలయం నుండి విజయవాడ కనకదుర్గ అమ్మవారి దగ్గరికి చేరుకున్నారు. ప్రతి సంవత్సరం గోవింద నామ ప్రచార సేవా సంఘం ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలోని అన్ని మండలాలలో" అమ్మకు సారె ' ఆనవాయితీగా ఇవ్వడం జరుగుతుందని, అందులో భాగంగా గన్నవరం మండలం సూరంపల్లి గ్రామం నుండి కనకదుర్గ అమ్మవారికి ఆషాడం సారె సమర్పించడం జరుగుతుందని గన్నవరం ఖండ సేవా ప్రముఖ యడవల్లి పాండురంగారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూరంపల్లి గ్రామం గ్రామ భక్తి బృందం, గ్రామ కన్వీనర్ బెజవాడ మధు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి ధర్మ ప్రచారం కార్యక్రమం నిర్వహించారు.

# మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి అస్వస్థత



**గన్నవరం, జులై 7, మేజర్ న్యూస్ :** గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మరోసారి అస్వస్థతకు గురయ్యారు. సోమవారం విజయవాడ బందర్ రోడ్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం ఆయన చేరారు. ముక్కులో ఒక రందరం పూడి పోవడంతో శ్వాస తీసుకోవడానికి ఆయన బాధపడుతున్నారు. సబ్ జైల్లో ఉండగా కొన్నిసార్లు తీవ్ర ఇబ్బందికి గురవటంతో ప్రభుత్వాసుపత్రితో పాటు ఆయుష్ ఆసుపత్రిలోనూ చికిత్స పొందారు. బెయిల్ మీద బయటకు వచ్చిన తర్వాత ఆయన తేలప్రోలు లోని గృహంలో ఉంటున్నారు. ప్రతిరోజు గన్నవరం, హనుమాన్ జంక్షన్, వీరవల్లి ఆత్కూరు, పోలీస్ స్టేషన్లలో కోర్టు ఆదేశాల మేరకు వివిధ కేసుల నిమిత్తం హాజరవుతున్నారు. అదేవిధంగా ప్రతి శనివారం ఆయా పోలీస్ స్టేషన్లకు వెళ్లి సంతకాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన ఆరోగ్యపరంగా కొంత ఒత్తిడికి లోనవుతున్నారు. పైన కోర్టును గౌరవించి అన్నిచోట్లకు వెళ్లి వస్తున్నారు. ఇదిలా ఉండగా విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు వంశీకి అన్ని పరీక్షలు నిర్వహించి ముక్కులో రంధ్రం పూడిపోయిందని, అందువల్ల శ్వాస తీసుకోవడం ఇబ్బంది అవుతుందని గుర్తించారు. వెంటనే ఆపరేషన్ చేయాలని చెప్పారు. శుక్రవారం ముక్కు ఆపరేషన్ కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా వైద్యులు మరికొన్ని పరీక్షలు చేసి ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాలని సలహా ఇచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం తీవ్ర జ్వరం రావడంతో పాటు గాలి పీల్చుకోవడానికి మరింత ఇబ్బంది అయ్యింది. ముక్కు ఆపరేషన్ చేస్తేనే ఫ్రీగా గాలి పీల్చుకోగలరని వైద్యులు తెల్చి చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయడానికి వైద్యులు వెనుకాడుతున్నారు. ఈ క్రమంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకోమని సలహా ఇచ్చారు. గాలి పీల్చుకునే సమస్య మరింత జటిలం కావడంతో వెంటనే బందర్ రోడ్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆయన చేరారు. వైద్యులు పరీక్షలు చేసి జ్వరం తగ్గడానికి చికిత్సలు చేస్తున్నట్లుగా ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ముక్కు ఆపరేషన్ కు అవసరమైన పరీక్షలు చేస్తున్నారనీ, ఆయన బాగానే ఉన్నారని, భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆయన గన్నవరం నియోజకవర్గంలో తిరుగుతున్నప్పుడు అభిమానులు పెద్ద సంఖ్యలో వచ్చి పలకరిస్తున్నారని, మహిళలు ఆయనను చూసి కంటతడి పెట్టుకుంటున్నారని స్నేహితులు చెప్పారు. ఆయన ఎడల ప్రజల్లో మరింత అభిమానం పెరుగుతుందన్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఎవరు తొందరపడి ఆసుపత్రికి వెళ్ళకూడదని విన్నవించారు.

## సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే



**పామర్రు జులై 7 మేజర్ న్యూస్ :** పామర్రు మండల పరిధిలోని పలు గ్రామాల్లో స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా సోమవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల పరిధిలోని రాపర్ల, జమిదగ్గుమిల్లి, ఉండ్రపూడి, పోలవరం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఒకేసారి వేయి రూపాయలు పింఛన్లు పెంచడం, సం.నికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ, తల్లికి వందనం వంటి కార్యక్రమాలను విజయవంతంగా లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు గొట్టిపాటి లక్ష్మీ దాసు, చాట్ల రమేష్, జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జ్ తాడిశెట్టి నరేష్, తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తల్లికి వందనం పథకం పై ప్రజలు సంతోషంగా ఉన్నారు : ఎమ్మెల్యే కాగిత



**పెడన, మేజర్ న్యూస్:** కూటమి ప్రభుత్వం సూపర్ సెక్స్ పథకాల లో ఒకటైన తల్లికి వందనం పథకం పట్ల ప్రజల సంతోషంగా ఉన్నారని, రాష్ట్ర తెలుగు దేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం లో అడుగడుగున నీరాజనాలు తిరుగుతున్నారని నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. కెమెరాకు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని పట్టణంలో గల 22వ వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసమే ఈ యొక్క కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రజల సమస్యలు తెలుసుకుని సత్వర పరిష్కారం చేపడతామన్నారు. అంతేగాక సంక్షేమ పథకాలు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నామన్నారు. కొన్ని ఇళ్లల్లో తల్లికి వందనం ముగ్గురు పిల్లలకు రావడంతో ఆనందం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, నియోజకవర్గ పరిశీలకులు గొట్టిముక్కల రఘురామరాజుపట్టణ టీడీపీ అధ్యక్షుడు వై. శ్యామలరావు, ఎర్ర రాజా, పరస జితేంద్ర, కమ్మగంటి వెంకటేశ్వరరావు( బాబు ), బొడ్డు దీక్షానందుడు, చందన నారాయణరావు, వహాబ్ ఖాన్, పరస సూర్యనారాయణ, పులి రవి, మేడక కిషోర్, తదితరులు ఉన్నారు.

## సుపరిపాలన - తొలి అడుగు



**నాగాయలంక మేజర్ న్యూస్ :** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాలను సారం కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయిన సందర్భంగా జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలకు వివరించే బృహత్తరమైన కార్యక్రమం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం నాగాయలంక మండలం స్వర్ణ గొంది గ్రామంలో జరిగింది కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాజీ పార్లమెంట్ సభ్యులు ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అవనిగడ్డ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ పరిశీలకులు రాష్ట్ర కార్యనిర్వాహణ కార్య దర్శి కనపర్తి శ్రీనివాసరావు సీనియర్ పార్టీ నాయకులు బొబ్బ గోవర్ధన్ దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు నాగా యలంక తెలుగు దేశం పార్టీ మండల పార్టీ ప్రెసిడెంట్ మెండు లక్ష్మణరావు పార్టీ కార్యకర్తలు అభిమానులు విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేసినారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా నాగాయలంక గ్రామంలో తెలుగుదేశం పార్టీ మహిళా జిల్లాఅధ్యక్షురాలు తలశిల.స్వర్ణలత ఇంటి ఆవరణలో అల్పా హారము సేవించి కలిసికట్టుగా స్వర్లగొంది గ్రామంలోకి బయలుదేరి వెళ్లి ఇంటి ఇంటికి ప్రభుత్వ పథకాల గురించి వివరించుచు ప్రజల యొక్క కష్టనష్టా లను తెలుసుకొని ప్రభుత్వం పైన అభిప్రాయాలు తెలుసుకొనుచున్నారు.

## ప్రజల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం



**నందిగామ, జులై 7, మేజర్ న్యూస్ :** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశానుసారం, సుపరిపాలనలో తొలి అడుగు ఇంటి ఇంటికి కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య పిలుపుమేరకు చందర్లపాడు మండలం తుర్లపాడు గ్రామంలో పార్టీ నాయకులు కార్యకర్తలు తో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు దాసరి ఏసుప్రభు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పార్టీ నాయకులతో కలిసి దాసరి ఏసు ప్రభు ప్రజలతో మమేకమై, తెలుగుదేశం పార్టీ ప్రజల సంక్షేమం కోసం, ముఖ్యంగా రైతులు, మహిళలు, యువత, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. "సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు, పాలనలో జవాబుదారీతనం, పారదర్శకతను నిర్ధారించడమే కూటమి లక్ష్యం," అని అన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలపై ప్రతి ఇంటిలోకి వెళ్లి గడపగడపకూ చంద్రబాబు నాయుడు సంకల్పాన్ని చాటి చెప్పారు. గత ఐదేళ్లలో వైసీపీ హయాంలో జరిగిన నష్టంతో పాటు ఏడాది కాలంలోనూ ప్రజలుమెచ్చిన పాలన అందించామని గణాంకాలతో వివరించారు. అత్యధిక కుటుంబాలకు మేలు చేకూర్చేలా తల్లికి వందనం కింద గతంలో ఒక్కరికే రూ.15 వేలు చెల్లిస్తే, ఇప్పుడు ఇద్దరికి మించి పిల్లలున్న వారందరికి రూ.30 నుంచి 60వేల వరకు తల్లి ఖాతాలో జమ చేసిన విషయానికి గడపగడపకు వెళ్లి వివరించారు. పేదల కోసం అన్నక్యాంటీన్లను ప్రారంభించడం, ఆగస్టు నుంచి మహిళలందరికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయాన్ని ప్రజలకు వివరించారు.

### తెలుగు సీరియల్స్‌లో ఇళ్ల రంగులతో..

# ఏషియన్ పెయింట్స్ 'ట్రాక్టర్ ఎమల్షన్ గృహశోభ' ప్రత్యేక కలర్ షేడ్ గైడ్



**విజయవాడ, జూలై 7, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ప్రజల దైనందిన జీవన శైలిలో టెలివిజన్ సీరియల్స్ ఒక భాగం. ఇవి సంస్కృతిని ప్రతిబింబిస్తున్నాయి. నూతన జీవన విధానానికి దారి చూపుతున్నాయి. దీనిని గుర్తించిన ఏషియన్ పెయింట్స్ ట్రాక్టర్ ఎమల్షన్ గ్రుహశోభ పేరుతో ఒక విభిన్నమైన కలర్ షేడ్ గైడ్‌ను ప్రారంభించింది. ఈ గైడ్ ప్రజల ఆదరణ పొందిన తెలుగు సీరియల్స్‌లో కనిపించే ఇంటి రంగుల ఆధారంగా రూపొందించారు. 80 ఏళ్లుగా భారతీయుల ఇళ్ల అందాన్ని పెంపొందిస్తూ వస్తున్న ఏషియన్ పెయింట్స్ ఈ గ్రుహశోభ ద్వారా తెరపై కనిపించే ఇళ్ల వాస్తవిక రంగులను ప్రతి ఇంటిలోకి తీసుకొస్తుంది. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ గైడ్ వినోదాన్ని, ఇంటి అలంకరణను ప్రతి ఇంటికి సరికొత్త శోభను తీసుకొస్తుంది. ట్రాక్టర్ ఎమల్షన్ గ్రుహశోభ అనేది ఎంతో కష్టపడి రూపొందించిన ప్రత్యేక రంగుల గైడ్. ఇది రాష్ట్రంలో అత్యధికంగా వీక్షించబడే తెలుగు టీవీ సీరియల్స్ సెట్ల నుంచి, వాటిలో ప్రధాన పాత్రధారులైన ఆదరణ పొందిన మహిళల నుంచి ప్రేరణ పొందింది. స్టార్ మా నెట్ వర్క్ కార్తీకదీపం 2లో దీపా, గుండె నిండ గుడి గంటలులో మీనా, ఇంటింటి రామాయణంలో అవని వంటి ప్రముఖ పాత్రల ఆధారంగా రూపొందించిన ఈ గైడ్ నేటి ట్రెండింగ్ కలర్ ప్యాలెట్లను సులభంగా అనుభవించగలిగేలా అందిస్తోంది. ఈ మూడు ప్రధాన ప్రైమ్ టైం సీరియల్స్ ప్రతి నెల 62 శాతం ప్రజలకు చేరతున్నాయి. సుమారు 5.5 కోట్లు మంది వీక్షకులు చూస్తున్నారు. ఇవి తెలుగు వారి జీవన శైలిలో స్టార్ మా నెట్ వర్క్ భాగమయ్యాయి. ఈ సందర్భంగా ఏషియన్ పెయింట్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అమిత్ సింగ్లే మాట్లాడుతూ ఏషియన్ పెయింట్స్‌లో రంగు అనేది కేవలం అలంకరణ అంశంగా మాత్రమే చూడమన్నారు. భావోద్వేగపూరితంగా, సాంస్కృతికంగా కూడా భావిస్తామన్నారు. ట్రాక్టర్ ఎమల్షన్ గృహశోభ ద్వారా మరింత అర్ధవంతంగా మార్చామన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలకు ఇది ఒక సన్నిహిత గైడ్‌గా ఉంటుందన్నారు. ఏషియన్ పెయింట్స్? సొంతమైన ఇంటీరియర్ పెయింట్ ట్రాక్టర్ ఎమల్షన్ ఆధునిక ఇళ్లకు అనుకూలంగా, తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండే ఉత్తమ ఎంపికగా నిలుస్తోందన్నారు. రంగు మసకబారకుండా ఉండే లక్షణం, నాలుగేళ్ల వారంటీ వంటి విశేషాలతో ఇది తెలుగు ఇళ్ల డెకర్‌లో నమ్మకమైన పేరుగా నిలిచిందన్నారు. 2000 పైగా షేడ్స్, అనేక ఫినిష్ వేరియంట్లతో ట్రాక్టర్ ఎమల్షన్ వినియోగదారులకు అందుబాటులో ఉందన్నారు. ఈ నమ్మకాన్ని మరింత ముందుకు తీసుకొచ్చేలా గృహశోభ గైడ్ రూపుదిద్దుకుందని తెలిపారు. ఇందులో 65 ప్రత్యేకంగా ఎంపిక చేసిన రంగుల కలయికలు కలవన్నారు. గదుల వారీగా స్టెన్సిల్ డిజైన్లు, అలంకరణ సూచనలు, రూపకల్పనలో ఉపయోగపడే మార్గదర్శకాలతో కూడిన సమగ్ర పుస్తకంగా ఇది తయారైందన్నారు. వినియోగదారులు తమ కలల ఇంటిని ఎలా ప్లాన్ చేసుకోవాలి, ఊహించుకోవాలి, డిజైన్ చేయాలో ఇందులో కలదన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఏషియన్ పెయింట్స్‌కు ప్రాధాన్య మార్కెట్లుగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ నటులు ప్రేమి విశ్వనాథ్, అమూల్య గౌడ, పల్లవి రామిశెట్టి మాట్లాడుతూ గృహశోభ ఒక అద్భుతమైన ఆవిష్కరణ అన్నారు. ఇంటికి సరైన రంగులను ఎంపిక చేయడం చాలా సార్లు అయోమయంగా ఉంటుందన్నారు. కానీ మనం ప్రతిరోజూ చూస్తున్న టీవీ సీరియల్స్ ద్వారా రంగుల కలయికలు నిజంగా ఎలా కనిపిస్తాయో? చూడడం, ఈ ప్రక్రియను సులభంగా మార్చుతుందన్నారు., ఏషియన్ పెయింట్స్ డీలర్ అవుట్‌లెట్లలో ఫిజికల్ కాపీని పొందవచ్చు. లేదా APTRACTOR అని టైప్ చేసి 56161 నెంబరుకు ఎస్ఎంఎస్ పంపితే, షేడ్ గైడ్‌ను వారి ఇంటికే పంపిస్తారు. గృహశోభ డిజిటల్ షేడ్ గైడ్‌ను ఏషియన్ పెయింట్స్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో Asian Paints Gruhashobha అని సెర్చ్ చేసి సులభంగా పొందవచ్చు.

## కూటమి ప్రభుత్వ పాలన చాలా బాగుంది అంటున్న ప్రజలు

**నందిగామ, జూలై 7, మేజర్ న్యూస్:**రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు సోమవారం సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నందిగామ మండలం కొత్తబెల్లంకొండ వారి పాలెం గ్రామం లో స్థానిక శాసనసభ్యు లు తంగిరాల సౌమ్య సూచన మేరకు సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో భాగంగా ఇంటింటినీ సందర్శించి ప్రజా సమస్యలను తెలుసుకుని వారి అభిప్రాయాలను సేకరించి సంవత్సర కాలంలో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనుల గురించి స్థానిక ప్రజలకు నందిగామ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వీరంకి వీరాస్వామిన్ వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షు జమ్మలముడివిష్ణు, బూత్ కన్వీనర్ పెమ్మసాని శ్రీనివాసరావు, గద్దె రమేష్ బాబు పొందూరి కోటి,శ్రీ రామినేని సురేష్, కడియాల చంద్రశేఖర్, జమ్మలమూడి వెంకట్రావు, చెరుకూరి కోటేశ్వరరావు,మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఏకమై పోరాడితేనే సమస్యల పరిష్కారం

### మొగల్రాజపురంలో పార్టీ రాష్ట్ర కార్యాలయం ప్రారంభం

**విజయవాడ, జూలై 7, మేజర్ న్యూస్ :** ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం క్రిస్టియన్ మైనారిటీలందరూ ఏకమై పోరాడితే తప్ప మన సమస్యలు పరిష్కారం కావని, అందుకు అంతా ఏకమవ్వాలని ఏఐబీఎస్పీ జాతీయ సమన్వయకర్త, మాజీ డీజీపీ డాక్టర్ జె. పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు. విజయవాడ మొగల్రాజపురంలోని విశాలాంధ్ర రోడ్డు నిమ్మతోట జంక్షన్ వద్ద కొత్తగా ఏర్పాటుచేసిన ఏఐబీఎస్పీ రాష్ట్ర కార్యాలయం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. "పాలక వర్గాలందరూ ముస్లింలను ఇతరులకు శత్రువులుగా చిత్రీకరిస్తున్నారు. అసలు వాళ్లు ఎవరికి శత్రువులు? బీసీ హిందువులకు ఎస్సీ ఎస్టీ లకు శత్రువులా.? ఎవరికీ కారు. 5 లక్షల మందికి పైగా ఉన్న దూదేకుల నుంచి ఇప్పటివరకు ఒక్కరికి కూడా ఎమ్మెల్యేగా అవకాశం రాలేదు. వడ్డీలు కుమ్మర్లు చాకలి మంగలి ఇంకా వంద బీసీ కులాలను హాయ్ ఎమ్మెల్యేలు లేరు. ఎందుకీ వివక్ష? ఇక ముఖ్యమంత్రి పదవులు కూడా కొన్ని కుటుంబాలకే పరిమితం చేసుకుంటున్నారు. ఒక ఎస్సీ, ఒక ఎస్టీ, ఒక బీసీ వ్యక్తి ముఖ్యవ ంత్రి అవ్వడానికి అర్హత లేదా? వైసీపీ అంటే జగనే ముఖ్యమంత్రి కావాలి. టీడీపీ అంటే అయితే చంద్రబాబు, లేకపోతే ఆయన కుమారుడు లోకేష్ ముఖ్యమంత్రి అవ్వాలి. వాళ్లు తప్ప ఇతరులు ఎవరూ పనికిరారా? అసలు వాళ్లలో వాళ్లకు పదవులు పంచుకోవడానికే సమయం అంతా సరిపోతోంది తప్ప, ఇతరుల సమస్యలు పట్టించుకోవట్లేదు. 80 లక్షల ఎస్సీ క్రిస్టియన్ల ఎస్సీ హోదా సమస్య పరిష్కరించరు, మైదానప్రాంత గిరిజనులైన ఎరుకల యానాదుల ఎస్టీ నియోజక వర్గాల ఏర్పాటు సమస్యలు పట్టవు, అలాగే



ఏజెన్సీ ప్రాంతాలలో స్థానికేతరులకు ఉద్యోగాలిచ్చే ఉత్తర్వుల రద్దు సమస్యలు పట్టవు. ఈ సమస్యలు పరిష్కరించమని కోరితే కోర్టు ఉత్తర్వులు అడ్డంగా ఉన్నాయంటారు. మరి 50 శాతం రిజర్వేషన్లు మించకూడదని చెబుతున్నా, ఈడబ్ల్యుఎస్ పేరుతో మీకు మాత్రం 10 శాతం రిజర్వేషన్లు ఎక్కడినుంచి వచ్చాయి? అది మీకెలా సాధ్యమైంది? అసలు రాజ్యాంగం ప్రకారం సామాజికంగా, ఆర్థికంగా వెనకబడినవారికే రిజర్వేషన్లు ఇవ్వాలి. మరి కమ్మ, రెడ్డి తదితర కులాల వాళ్లు సామాజికంగా వెనకబడ్డారా? ఆర్థికంగానా ? అని సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఏఐబీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త బి. పరంజ్యోతి, మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లకే రాజారావు తదితరులు పాల్గొన్నారు.



## కోలాహలంగా ధోనీ జన్మదిన వేడుకలు

**విజయవాడ, జూలై 7, మేజర్ న్యూస్ :** టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ జన్మదిన వేడుకలు అభిమానుల కోలాహలం నడుమ ఘనంగా జరిగాయి. గాంధీనగర్ శైలజ థియేటర్ వద్ద సోమవారం నిర్వహించిన ఈ వేడుకలకు జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేక్ కట్ చేసిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలి రాజేష్ మాట్లాడుతూ.. క్రికెట్ చరిత్రలో తనకంటూ ప్రత్యేకతను సృష్టించుకున్న వ్యక్తి ఎంఎస్ ధోని అని అన్నారు. 28 ఏళ్ల నిరీక్షణకు తెరదింపి మన దేశానికి వరల్డ్ కప్ అందించిన విశ్వ విజేత ఎంఎస్ ధోని అని కొనియాడారు. ప్రపంచంలో ఏ క్రికెట్ టీం కెప్టెన్ సాధించని ఐసీసీ ట్రోఫీలను దేశానికి అందించిన ఏకైక క్రికెట్ ప్లేయర్ ధోని అని పేర్కొన్నారు. జట్టు క్లిష్ట సమయంలో ఉన్నప్పుడు ఎంతో వ్యూహాత్మకంగా వ్యవహరించి జట్టును విజయతీరాలకు చేర్చిన గొప్ప క్రికెటర్ ధోని, క్రికెట్ దేవుడు అయినటువంటి సచిన్ టెండూల్కర్ వరల్డ్ కప్ గెలవాలన్న కలను నిజం చేసిన గొప్ప నాయకుడు ధోని అని అన్నారు. ధోనీ జన్మదిన వేడుకల్లో భాగంగా బెజవాడ పవన్ కళ్యాణ్ యువసేన, విజయవాడ క్రికెట్ ధోని ఫ్యాన్స్ ఆధ్వర్యంలో 1000 మందికి అన్నదానం నిర్వహించడం అభినందనీయమని మండలి రాజేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర ఉపాధ్యక్షుడు కామల్ల సోమనాదం, నగర సంయుక్త కార్యదర్శి సోడిశెట్టి రాధా కిరణ్, 59వ డివిజన్ అధ్యక్షుడు తాడి దుర్గారావు, 57వ డివిజన్ అధ్యక్షుడు పైలా ప్రకాష్, కోసూరి హనుమంతు, దాసరి బాలాజీ, భీమన వెంకట్, విజయ్, రాజా, జనసేన నాయకులు, కార్యకర్తలు, మహేంద్రసింగ్ ధోని అభిమానులు పాల్గొన్నారు.

## ఏటీఎం మోడల్‌తో నిత్య ఆదాయం..

### ఈ విధానంపై పెద్దఎత్తున రైతులకు అవగాహన కల్పించండి

### పెరటి, మిద్దె తోటల దిశగానూ ప్రజలను ప్రోత్సహించాలి

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, జులై 07, మేజర్ న్యూస్ :** ఏడాది పొడవునా ఆదాయం వచ్చేలా ఏటీఎం (ఎనీ టైమ్ మనీ) విధానంలో కూరగాయలు, ఆకుకూరలను పండించే విధానంపై పెద్దఎత్తున రైతులకు అవగాహన కల్పించి, ప్రోత్సహించాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ, ప్రజా భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం (ఏపీ సీఎన్ఎఫ్) విభాగాల ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏడు సెంట్ల విస్తీర్ణంలో 22 రకాల విత్తనాలతో ఏటీఎం మోడల్ కూరగాయల పెంపకాన్ని కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రసాయనిక ఎరువులను విడనాడి రైతులు ప్రకృతి వ్యవసాయం బాట పట్టేలా ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. రసాయన ఎరువుల జోలికి వెళ్లకుండా బీజామృతంతో విత్తన శుద్ధి, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నాస్త్రం, పంచగవ్య తదితర ప్రకృతి సేద్య విధానాలను ఉపయోగించి ఆరోగ్యకరమైన కూరగాయలు, వ్యవసాయ ఉత్పత్తులను పొంది మెరుగైన ఆదాయాన్ని ఆర్జించవచ్చన్నారు. తక్కువ విస్తీర్ణంలో సైతం వివిధ రకాల కూరగాయలు, దుంప, తీగజాతి రకాల పంటలను పండించడం వల్ల ఏడాది పొడవునా ఆదాయం పొందేందుకు అవకాశముంటుందన్నారు. పెరటి, మిద్దె తోటలు దిశగా కూడా ప్రజలను ప్రోత్సహించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, డీపీఎం శంకర నాయక్, రీజనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ అరుణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల క్షేమమే ప్రధానం





## కొండ ప్రాంతాల్లో ప్రమాదకరమైన నివాసాలలో నివసిస్తున్న వారిని వెంటనే తరలించండి

### విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** వర్షాకాలదృశ్య కొండ ప్రాంతంలో ప్రమాదకరమైన నివాసాలలో నివసిస్తున్న ప్రజలను వెంటనే తరాలించాలని నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం ఉదయం తన పర్యటనలో భాగంగా పంజా సెంటర్, చిట్టినగర్, కబేళా, లేబర్ కాలనీ, వర్క్ షాప్ రోడ్, కుమ్మరిపాలెం సెంటర్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయి లో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొండ ప్రాంతాలలో ప్రమాదానికి అవకాశం ఉన్న ఇళ్లలో నివసిస్తున్న ప్రజలకు అవగాహన కల్పించి ఇంటి నుంచి తరలించి వారికి సురక్షమైన ఇళ్ళను కేటాయించాలని కబేళాలో జేఎన్ఎన్యూఆర్ఎం ఇళ్లను పరిశీలించి అధికారులను ఆదేశించారు. నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్ లో భాగంగా చిట్టినగర్ లో ఉన్న నైట్ షెల్టర్ హోమ్స్‌లో అక్కడ వచ్చే నిరాశ్రయులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని, నగరంలోన నిరాశ్రయులందరికి షెల్టర్ హోమ్స్ లో వసతి కల్పించాలని అందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ అధికారులను ఆదేశించారు. పంజా సెంటర్ కృష్ణవేణి క్లాత్ మార్కెట్ వద్ద జరుగుతున్న డీసెల్టింగ్ పనులను పరిశీలించారు. లేబర్ కాలనీలో జరుగుతున్న కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్లో అన్న క్యాంటీన్ పరిశీలించి, పారిశుద్ధ్య నిర్వాహణకు అధికారులు తీసుకున్న ప్రత్యేక శ్రద్ధను అభినందిస్తూ నగర పరిధిలో గల అన్ని అన్న క్యాంటీన్లలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు ఇటువంటి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్ పనుల్లో పురోగతి వేగవంతం చేసుకునేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పని ఇచ్చిన ప్రతి కాంట్రాక్టర్ పని పూర్తి చేయాలని అధికారులు పర్యవేక్షిస్తుండాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే అర్జున్ రావు, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, పర్యవేక్షణ ఇంజనీర్లు పి.సత్యనారాయణ, పి సత్యకుమారి, ఎస్టేట్ ఆఫీసర్ ఏ శ్రీధర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) పి. వెంకటనారాయణ, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, జాయింట్ డైరెక్టర్ అమృత్ డాక్టర్ లత, డి ఎఫ్ ఒ మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

## 10న జరగనున్న తల్లిదండ్రులు ఉపాధ్యాయుల మెగా సమావేశాన్ని విజయవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈ నెల 10వ తేదీన జరగనున్న తల్లిదండ్రులు ఉపాధ్యాయుల మెగా సమావేశాన్ని అందరూ కలిసికట్టుగా విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు.సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్ నుండి సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల మెగా సమావేశం ఏర్పాట్లపై జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 10వ తేదీన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల మెగా సమావేశాన్ని చాలా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఆదేశించిందన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే ఇటువంటి సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సారి ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలన్నింటిలో మెగా సమావేశాన్ని నిర్వహించాలన్నారు.ఈ సమావేశం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించాలని చివరగా సహపంక్తి భోజనంతో ముగించాలన్నారు.ఈ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు మరి ముఖ్యంగా తల్లికి వందనం లబ్ధిదారులందరూ తప్పనిసరిగా వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముందుగానే వకృత్వం వ్యాసరచన, చిత్రలేఖనం వంటి పోటీలు నిర్వహించాలన్నారు. తల్లిదండ్రులకు ఆరోజున మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, టగ్ ఆఫ్ వార్ వంటి పోటీలు నిర్వహించాలన్నారు. తల్లికి వందనం లబ్ధిదారులకు వారి అభిప్రాయాలను తెలిపే విధంగా అవకాశాలు కల్పించాలన్నారు. ఈ జూమ్ మీటింగ్లో జిల్లా విద్యాధికారి పివిజే రామారావు, జిల్లాలోని మండల విద్యాధికారులు పాల్గొన్నారు.



## పొగాకు ఉత్పత్తులపై పోలీస్ ప్రత్యేక డ్రైవ్

**పెడన, మేజర్ న్యూస్ :** జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర రావు ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల సమీపాల్లో ఉన్న పొగాకు ఉత్పత్తులు విక్రయించే దుకాణాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని ఎస్సై జి సత్య నారాయణ తెలిపారు. కెమెరాకు పాఠశాలల చుట్టుపక్కల గల దుకాణాలపై తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై సత్యనారాయణ ఒక ప్రకటనలో మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, 2003 పొగాకు నియంత్రణ చట్టం నిబంధనల మేరకు నిబంధనలు ఉల్లంఘిస్తున్న వ్యాపారులపై జరిమానాలు విధించామన్నారు. విద్యా సంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు అమ్మకానికి లేదు అనే బోర్డులు ఏర్పాటు చేయాలని వ్యాపారులకు సూచించారు. ఈ తనిఖీల్లో పట్టణ పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ప్రమాదపుటంచున కాలిబాట వంతెన




**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** స్థానిక సీతాయ లంక వద్ద పంట కాలువపై నిర్మించిన కాలిబాట వంతెన ప్రమాదంలో ఉన్నది. పంట కాలువలకు సాగునీరు విడుదల చేయగా ఎగువ నుండి కొట్టుకు వచ్చిన చెత్తాచెదారంతో పాటు భారీ ఎత్తున గుర్రపు డెక్క కొట్టుకు వచ్చి వంతెన వద్ద నిలిచిపోయింది. దీంతో వంతెనకు ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. పంట కాలువలకు సాగునీటిని విడుదల చేసి వారం రోజులు గడుస్తున్నప్పటికీ ఇరిగేషన్ అధికారులు పంట కాలువలపై నిఘా పెట్టకపోవడంతో వంతెనల వద్ద గుర్రపు డెక్క టన్నులకొద్దీ పేరుకుపోతుంది దీనితో వంతెనలు ప్రమాద స్థాయి చేరే అవకాశం కూడా ఉంది. పులిగడ్డ ఇరిగేషన్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న అవనిగడ్డ శీతాలంక కాలిబాట వంతెన వద్ద గుర్రపు డెక్క టన్నుల కొలది పేరుకుపోయి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటుంది గత నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ ఇరిగేషన్ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన నీటి సంఘాల అధ్యక్షులు కూడా అటువైపు చూడకపోవడంతో తీర ప్రాంతాలకు తాగు నీటిపారుదల ప్రశ్నార్ధకం అయ్యింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గుర్రపు డెక్కపై చర్యలు తీసుకొని తొలగించాలని దిగువ రైతాంగం కోరుతున్నారు.

## ఘనంగా మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సోమవారం స్థానిక మలకపట్నం గుప్తా సెంటర్ వద్ద మాన్యశ్రీ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పుట్టినరోజు, ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు స్థానిక మలకాపట్నం గుప్తా సెంటర్ లో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించటం జరిగినది. 19వ డివిజన్ కార్పొరేటర్ దేవరపల్లి అనిత ముఖ్య అతిథిగా విచ్చేసి, ఎమ్మార్పీస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జండా ఆవిష్కరించినారు మందకృష్ణ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసినారు అనిత మాట్లా డుతూ మందా కృష్ణ మాదిగా నాటిన చెట్టు మహావృక్షమై ఫలాలు ఇస్తుంది అవి రాబోవు తరాలు వారు అనుభవిస్తారు అని తెలిపారు. మందా కృష్ణకి ఎనలేని కృతజ్ఞతలు తెలియజేసినారు ఈ కార్యక్రమంలో గంద్రపు సీనయ్య మాస్టారు, బీడెల్లి మరియ కుమార్,కొడాలి అజయ్ కుమార్, బండారు వెంకటేశ్వరరావు, కొడమంచిలి చంద్రశేఖర్,పి వెంకటేశ్వరరావు,ఎంపీడీవో రిటైర్డ్ శీలం శర్మ,చిట్టి బాబు, బండారు సోమేశ్వరరావు, కొడాలి యోహాను, గణేష, న్యాయవాదులు అద్దేపల్లి నిరంజన్ రావు గురిందపల్లి విజయబాబు కుంపటి ప్రసాద్ ఇసుకపల్లి ప్రభుదాస్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ నేతల త్యాగ ఫలమే ఎస్సీ వర్గీకరణ



**విజయవాడ మేజర్ న్యూస్ :** ఎస్సీ వర్గీకరణ ఎమ్మార్పీఎస్ నేతల త్యాగ ఫలమేనని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ మానికొండ శ్రీధర్ మాదిగ అన్నారు. సోమవారం గాంధీనగర్ ఎమ్మార్పీఎస్ కార్యాలయం లో 31 వ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా దండోరా జెండాని రాష్ట్ర కో కన్వీనర్ మానికొండ శ్రీధర్ మాదిగ అధ్యక్షతన తెలుగుదేశం సీనియర్ నాయకులు దళిత రత్న రాష్ట్ర ఎస్సీ సెల్ పరిస పోగు రాజేష్ మాదిగ జండా వందనం చేశారు. అర్బన్ ఎమ్మార్పీఎస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేష్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు తెలుగుదేశం పార్టీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టారు ఏది ఏమైనా జాతి కోసం వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ నాయకుల త్యాగ ఫలితాలని కొనియాడారు. తదనంతరం మానికొండ శ్రీధర్ మాదిగ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా దేశంలోనే మొట్టమొదటి రాష్ట్రాలు తెలుగు రాష్ట్రాలు అయినా తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాలని తెలంగాణ రాష్ట్రం చట్టం చేస్తే ఆంధ్రప్రదేశ్ ఆర్డెన్సి తెచ్చి మాదిగ మాదిగ ఒప్పుకోలాలకు ఈ ఎకనామిక్ ఇయర్ పాడవకుండా ఉద్యోగాలలో గాని విద్యా అర్హతల్లో గాని తమ వాటా తమకు దక్కిందని, ఇక్కడ చంద్రబాబుకి అక్కడ రేవంత్ రెడ్డికి జాతి తరపున కృతజ్ఞతా భావం కలిగి ఉంటామని, రాజకీయాలలో కూడా మా వాటా మాకు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నామని, అందుకే పుట్టిన గడ్డ మీదే మాదిగ సభను ఏర్పాటు చేశామని తెలిపారు. అదేవిధంగా మరో ముఖ్య రాష్ట్ర నాయకులు పరస రామయ్య మాదిగ మాట్లాడుతూ 31 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం త్యాగాలు ఆత్మ బలిదానాలు ప్రముఖ న్యాయస్థానం గుర్తించి అందుకే ఈరోజు ఆత్మబలిదానం చేసుకున్న కుటుంబాలను పిలిచి సభలో ఘనంగా సన్మానిస్తామని తెలిపారు. భవిష్యత్తులో కూడా న్యాయ పోరాటం ద్వారా బడుగు వర్గాల పక్షాన నిలబడుతుంది అని తెలిపారు. ఈ సమావేశంలో విజయవాడ అర్బన్ ముఖ్య నాయకులు మాతంగి సంజయ్ నోవా మాదిగ, ఆదామదిగా బాండ్ మాదిగ, నరేష్ మాదిగ, పోగు ప్రసాద్ మాదిగ, మహిళా నాయకులు లక్ష్మీ మాదిగ, రామా రోహిణి తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు చందర్లపాడు, ఇబ్రహీంపట్నం, ఏ.కొండూరు, మైలవరం, విసన్నపేట, గంపలగూడెం మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999